సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మీర్జాపురం గ్రామంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మీర్జాపురం, బంగారు చెన్నేపల్లి, గొంగటి వారిపల్లి, పాతదేవరపల్లి, కొత్తదేవరపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అర్హులై ఉండి సంక్షేమ ఫలాలు ఎవరికైనా అందలేదా అని ఆరా తీశారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. గత టీడీపీ హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. అయితే జగన్ సీఎం అయ్యాక రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తారు రోడ్లు వేసి ప్రజల రాకపోకలను సుగమం చేశామన్నారు. ప్రతి ఇంటిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్, వారి పిల్లలకు విద్యాకానుక, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు, చేయూత తదితర సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. ఇంతకంటే ఏ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. అనంతరం రూ.20.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.17.5 లక్షలతో నిర్మించిన ఆర్బీకేను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజినేయ రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణా రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, నాయకుడు మటన్ శంకర్, ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ చెన్నారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పాతిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు రవీంద్రా రెడ్డి, మురళీధర్ రెడ్డి, కేశవరెడ్డి, అంగడి సోమశేఖర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ వడ్డె భాస్కర్, యల్లప్ప, వాల్మీకి శంకర్, వెంకటరాముడు, సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండల పరిధిలోని రెక్కమాను గ్రామంలో శనివారం జగనన్న చేదోడు లబ్ధిదారులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వరుసగా నాలుగో సంవత్సరం కూడా ఖాతాల్లో రూ.10 వేలు జమ చేయడం హర్షణీయమని పలువురు నాయీ బ్రాహ్మణులు, దర్జీలు, రజకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఖాజావలీ, గృహసారథి బాలచంద్ర, లబ్ధిదారులు మౌలా, భారతి, రమణమ్మ, ఆదిలక్ష్మి, వెంకటేష్, వలంటీర్లు మేకల శివప్రసాద్, ఫిరోజ్, మనోహర్ నాయక్ పాల్గొన్నారు.

టీడీపీవి నిరాధార ఆరోపణలు



మాట్లాడుతున్న బండ్లపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తచెరువు: అర్హులకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే.. ఇది ఓర్వలేని టీడీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తూ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. మండలంలోని బండ్లపల్లి పంచాయతీ జగనన్న కాలనీలో వైకాపాలో వర్గాల పోరు.. పట్టాలకు డబ్బులు వసూళ్లు అంటూ రెండు తోక పత్రికల్లో నిరాధార కథనాలు రాయించడం విడ్డూరమన్నారు. పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య ఎలాంటి వర్గపోరు లేదన్నారు. అందరూ ఒకే కుటుంబంలా పని చేస్తున్నామన్నారు. సీనియర్ నాయకుడు మహబూబ్ బాషా, కో–ఆప్షన్ మెంబర్ మున్వర్ బాషా పట్టాలకు డబ్బులు వసూలు చేశారని రాయించడం దుర్మార్గమన్నారు. పంచాయతీలో వైఎస్సార్‌సీపీ బలోపేతం అవుతుండటంతో టీడీపీ నాయకులు ఓర్చుకోలేక పోతున్నారని మండిపడ్డారు. సమావేశంలో బండ్లపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పారెడ్డి, నాయకులు రూప్లానాయక్, వేమూరి సూరి, మున్వర్ బాషా, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

ధర్మవరం అర్బన్: అమరుల ఆశయాలను పాటిద్దామని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రక్తబంధం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు కన్నా వెంకటేష్ ఆధ్వర్యంలో 54 మంది రక్తదానం చేశారు. విధి నిర్వహణలో అమరులైన పోలీస్ అధికారులు చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నల్లచెరువు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ లింగన్న ఆధ్వర్యంలో శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీస్ అధికారులు చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కనగానపల్లి: చెన్నేకొత్తపల్లి మండలంలోని వెల్దుర్తి వద్ద అమరవీరుడు సుధాకర్‌రెడ్డి విగ్రహానికి పోలీసులు నివాళులర్పించారు. కార్యక్రమంలో రామగిరి సీఐ చిన్నగౌస్, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

రామగిరి: మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాన్ని ఎస్ఐ జనార్దన్‌నాయుడు వివరించారు.

తండ్రి మాట నెరవేర్చిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని పందులకుంట గ్రామంలో 2019 ఎన్నికల ప్రచారంలో తండ్రి గంగిరెడ్డి గ్రామస్తులకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి నెరవేర్చారు. వివరాలు.. 2019 ఎన్నికల ప్రచారంలో తన కుమారుడిని గెలిపించాలంటూ గంగిరెడ్డి పందులకుంటలో ప్రచారం చేపట్టారు. అందులో భాగంగా తమ గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. శనివారం రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి భూమిపూజ చేసి, రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లు వేసుకున్నామన్నారు. మరోసారి మన ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, సర్పంచ్ నారపరెడ్డి, ఎంపీటీసీ కుమార్‌రెడ్డి, నాయకులు ప్రణీత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ చలపతినాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డిని విమర్శిస్తే ఉపేక్షించం



మాట్లాడుతున్న సర్పంచ్ సురేష్ రెడ్డి, నాయకులు

ధర్మవరం: నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించేది లేదని రేగాటిపల్లి సర్పంచ్ సురేష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగితే దానిని ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఆపాదించి చిలకం మధుసూదన్‌రెడ్డి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. మధుసూదన్ రెడ్డి బంధువు రాజారెడ్డిపై దాడి చేసిన వారికి వ్యక్తిగత గొడవలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ దాడికి కారణమైన వారిని వెంటనే పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది మరచి జనసేన నాయకులపై దాడి జరిగిందని నానా యాగి చేసి సత్వరం స్పందించిన పోలీసులపై, ఎమ్మెల్యే కేతిరెడ్డిపై ఆరోపణలు చేయడమేంటని ప్రశ్నించారు. రేగాటిపల్లిలో సర్పంచ్‌గా గెలువలేని నీకు ఎమ్మెల్యే కేతిరెడ్డిని విమర్శించే స్థాయి లేదని మండిపడ్డారు. ఇకపై ఎమ్మెల్యే కేతిరెడ్డిపై నిందారోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోగే కొండారెడ్డి, సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, అప్పిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



జనసేన నాయకుడు మధుసూదన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ముదిగుబ్బ: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఇందుకూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ధర్మవరంలో జనసేన కార్యకర్త రాజారెడ్డిని ఎవరో తాగుబోతులు కొడితే ఎమ్మెల్యే కేతిరెడ్డిని విమర్శిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యత, సంస్కారం లేకుండా ఒరే, తరే అని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. స్థాయికి మించి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భాస్కర్, లేకేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, కుళ్లాయప్ప, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాయకులు సంయమనం పాటించకపోతే కేసులు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం: రాజకీయ పార్టీల నాయకులు సంయమనం పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనసేన నాయకుడు రాజారెడ్డిపై దాడి విషయంలో పోలీసులను నిందించడం సరికాదన్నారు. గొడవ జరుగుతోందని తెలియగానే వెంటనే ఎస్ఐ ప్రదీప్‌కుమార్ వెళ్లి, ఆసుపత్రికి చేర్చారన్నారు. పోలీసులు దేవుడిలా వచ్చారు అని రాత్రి చెప్పి ఉదయాన్నే పోలీసులు స్పందించలేదని విమర్శించడం సరికాదన్నారు. అనవసరంగా ప్రెస్ మీట్‌లు, సోషల్ మీడియాల్లో ఇతరులను రెచ్చగొట్టేలా మాట్లాడితే ఇలాంటి గొడవలు జరుగుతాయన్నారు. ఇక నుంచి సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా విమర్శించుకుంటే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఓ టీకేఫ్‌లో జనసేన నాయకుడు రాజారెడ్డి, వెంకటేష్ కూర్చుని ఉండగా అక్కడున్న వినయ్ అనే వ్యక్తి కల్లు వ్యాపారంపై మా నాన్నను విమర్శిస్తావా అంటూ వెంకటేష్‌ను మందలించాడన్నారు. వినయ్, వెంకటేష్ గొడవపడగా రాజారెడ్డి వారిని అడ్డుకుని సర్ది చెప్పాడన్నారు. దీంతో వ్యక్తిగతంగా రాజారెడ్డిపై వినయ్ స్నేహితులు దాడికి పాల్పడ్డారన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

పుట్టపర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 6, 7, 8, 12, 14 వార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు శనివారం ఓ ప్రకటన విడుదల చేశాయి.

అయోడిన్‌తో ఆరోగ్యం పదిలం

ధర్మవరం అర్బన్/బత్తలపల్లి: అయోడిన్ కలిగిన ఉప్పును మన ఆహారంలో తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సోలమన్ అన్నారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి, బత్తలపల్లి మండలం రామాపురంలో శనివారం జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవాన్ని నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ చేశారు.

రూ.50 వేల విరాళం అందజేత

కదిరి అర్బన్: కాళసముద్రం పంచాయతీ పరిధిలోని నడింపల్లి సమీపంలో ఆదివారం జిల్లా స్థాయి ఎద్ల బండ్ల పోటీలు జరగనున్నాయి. పోటీలకు వచ్చే రైతులకు భోజన వసతి కల్పించేందుకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి రూ.50 వేల విరాళం పంపించారు. ఈ మొత్తాన్ని శనివారం కార్యక్రమ నిర్వాహకులకు వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు.

పేదలకు ఉచితంగా వైద్య సేవలు

తలుపుల/నల్లచెరువు/బత్తలపల్లి: తలుపుల మండలం నూతనకాల్వలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, సర్పంచ్ షేక్షావలి, పెద్దినాయుడు, వైద్యాధికారులు మున్వర్‌బాషా, సల్మా, ఎంపీపీ రఫీనాయక్, కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, మాజీ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. నల్లచెరువు మండల పరిధిలోని పి.కొత్తపల్లి సచివాలయ పరిధిలో 460 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హైదర్‌వలి, ఎంపీడీఓ శకుంతల, స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, వైద్యాధికారులు ఐనుద్దీన్, నాగార్జునరెడ్డి, ఎంపీటీసీ మాధవిలత, సర్పంచ్ సోనాలమ్మ పాల్గొన్నారు. బత్తలపల్లి మండలం ఓబుళాపురం పంచాయతీ పరిధిలోని రామాపురం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, ఈఓఆర్డీ దివాకర్, వైద్యాధికారులు గంగిరెడ్డి, రామకృష్ణ, సీఎస్‌డీటీ శారద, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రామగిరి: ఎంసీపల్లిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఫజిల్‌బాషా, మండల అగ్రిబోర్డ్ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ సిద్దన్న, ఎంపీటీసీ ఆదిలక్ష్మి, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

కనగానపల్లి: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు శనివారంతో ముగిసినట్లు కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, ఇతర మండల ప్రజాప్రతినిధులు వైద్య, ఆరోగ్య సిబ్బందిని సన్మానించారు.

కలెక్టర్‌ను కలసిన ఆర్డీఓ



కలెక్టర్ అరుణ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

పుట్టపర్తి అర్బన్/కదిరి: కదిరి ఆర్డీఓగా బదిలీపై వచ్చిన వంశీకృష్ణ శనివారం కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్ఓ కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే, ఈవీఎంల పరిశీలన, జాతీయ రహదారుల భూ సేకరణపై దృష్టి సారించాలని ఆర్డీఓకు సూచించారు. అంతకుముందు కదిరి ఆర్డీఓ కార్యాలయంలో వంశీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నష్టం

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం రామసాగరం గ్రామానికి చెందిన పెద్దన్న ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఇంట్లోని బట్టలు, నిత్యావసర వస్తువులు, టీవీ, ఫ్రిజ్ కాలిపోయాయి. దాదాపు రూ.లక్ష వరకూ ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

ఆర్డీఓకు వీడ్కోలు

కదిరి అర్బన్: బదిలీపై వెళ్తున్న ఆర్డీఓ రాఘవేంద్రకు శనివారం కార్యాలయ సిబ్బంది, డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆర్డీఓకు దుశ్శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుబ్బులక్ష్మి, శ్రీనివాసరెడ్డి, మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శాంతిభద్రలపై నిఘా పెట్టాలి

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం సీఐ తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ ఫైళ్లు, పాత కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ వెంకటనారాయణ, సిబ్బందితో సీఐ మాట్లాడుతూ..పేకాట, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించాలన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

నల్లచెరువు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గూడూసాహెబ్ (76) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదేశాలతో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్ రఫీ పాల్గొన్నారు.

చిన్నకుళ్లాయి స్వామి ఉరుసు ప్రారంభం

ఎన్పీకుంట: వెలిచలమల గ్రామంలో శనివారం చిన్నకుళ్లాయి స్వామి ఉరుసు ఘనంగా ప్రారంభమైంది. పేటబావి వద్ద నుంచి చిన్నకుళ్లాయిస్వామి పీరును పూలహారాలతో ప్రత్యేకంగా అలంకరించి డప్పు, వాయిద్యాలు, మేళతాళాలతో పీర్లచావిడిలో కొలువుదీర్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి, చెక్కర చదివింపులు చేయించారు.

వరములివ్వు.. దుర్గామాత



ధర్మవరంలో గాయత్రి దేవిగా పెద్దమ్మ తల్లి

సాక్షినెట్‌వర్క్: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శరన్నవ రాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఏడవ రోజు వివిధ ఆలయాల్లో అమ్మవార్లు ధనలక్ష్మి, దుర్గామాత, లలితా త్రిపుర సుందరి దేవి, కామాక్షి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టారు.